

నేడు మహిళా కమిషన్ చైర్‌పర్సన్ జిల్లాకు రాక

అరసవల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ బుధవారం జిల్లాకు రానున్నట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. 'మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శైలజ బుధవారం ఉదయం 8 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరి 10 గంటలకు స్థానిక ఆర్ట్స్ కళాశాల వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆడిటోరియానికి చేరుకుంటారు. అక్కడ కార్యక్రమాల అనంతరం విలేకరులతో సమావేశం నిర్వహిస్తారు. మళ్లీ మధ్యాహ్నం ఒంటిగంటకు శ్రీకాకుళం నుంచి బయలుదేరి విశాఖపట్నం చేరుకుంటార'ని కలెక్టర్ తెలిపారు.





తెలినీలాపురంలో విదేశీ పక్షుల సందడి

తెలినీలాపురంలో విదేశీ పక్షులు

- విడిది కేంద్రంలో కానరాని సౌకర్యాలు
- పర్యాటకులకు తప్పని ఇబ్బందులు

టెక్కలి రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి):

విదేశీ పక్షులతో టెక్కలి మండలం తెలినీలాపురం గ్రామం కళకళలాడుతోంది. సైబీరియా, బర్మా, బంగ్లాదేశ్, ఆస్ట్రేలియా తదితర దేశాల నుంచి ఏటా అక్టోబరు, నవంబరు నెలల్లో పెలికాన్స్, నత్తగుల్ల కొంగలు, తెల్లకంకణాలు తదితర పక్షులు తెలినీలాపురంతోపాటు ఇచ్ఛాపురం మండలంలోని తేలుకుంచి గ్రామాలకు చేరుకుంటాయి. వేల కిలోమీటర్లు ప్రయాణించి ఇక్కడ సంతానోత్పత్తి చేస్తాయి. వాటి పిల్లలతో ఏప్రిల్‌లో తిరుగు పయనమవుతాయి. ఈ క్రమంలో ఇప్పటికే తెలినీలాపురానికి విదేశీ పక్షులు రాగా.. కార్తీకమాసం వేళ పర్యాటకుల సందడి పెరిగింది. జిల్లాతోపాటు విశాఖపట్నం, విజయనగరం, గోదావరి తదితర జిల్లాలు, ఒడిశా రాష్ట్రం నుంచి అధికంగా పర్యాటకులు వస్తున్నారు. కాగా.. తెలినీలాపురంలోని విడిది కేంద్రంలో సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు తప్పడం లేదు.

● టీడీపీ ప్రభుత్వ హయాంలో తెలినీలాపురానికి పర్యాటకశాఖ నిధులు కేటాయించింది. అంతర్గత రహదారులు, చిల్డ్రన్ పార్క్ నిర్మించారు. పక్షులు జీవన విశేషాలు, ఇతర సమాచారాన్ని తెలిపే కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కానీ వైసీపీ ప్రభుత్వ హయాంలో కనీసస్థాయిలో విడిది కేంద్రాన్ని (మిగతా 7వ పేజీలో..)



విడిది కేంద్రంలో పాడైన టవర్లు

ప్రతి పక్షీ ప్రత్యేకం

● **పెలికాన్స్ (గూడబాతులు):** తెలినీలాపురంలో పెలికాన్స్ పక్షులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఇవి సైబీరియా, బర్మా, బంగ్లాదేశ్, ఆస్ట్రేలియా దేశాల నుంచి వచ్చాయి. ఇవి 3 అడుగుల ఎత్తు, ఐదారు కిలోల బరువు ఉంటాయి. పొడవైన రెక్కలు, ముక్కు కింద గూడులాంటి సంచి ఉంటుంది. 2 కిలోల వరకు వేటాడిన చేపలను పట్టుకుని ఎగురగలవు. 2 నుంచి 3 గుడ్లు పెట్టి 30రోజుల పాటు పొదిగి పిల్లలను చేస్తాయి.

● **నత్తగుల్ల కొంగలు (ఓపెన్‌బిల్డ్ స్టోర్క్):** ఈ పక్షులు 3 కిలోల బరువ ఉండి.. బూడిద నలుపు రంగులో ఉంటాయి. ముక్కు పట్టకర్ర ఆకారంలో ఉంటుంది. నత్తల పైభాగంలో ఉన్న పెంకును ముక్కు సాయంతో పగలకొట్టి మాంసాన్ని తింటుంది. ఇది నీటిలో దిగి ఈదలేదు. గుంతలు, చిత్తడినేలల్లో తిరుగుతూ ఆహారాన్ని సేకరిస్తాయి. ఈ పక్షులు ఇచ్ఛాపురం, సోంపేట మండలాల్లో అధికంగా కనిపిస్తున్నాయి.

● **తెల్లకంకణాలు (వైట్‌ఐబీస్):** శ్రీలంక, బర్మా, బంగ్లాదేశ్, కంబోడియా, మంగోళియా, దేశాలు నుంచి ఈ పక్షులు వస్తాయి. రెండు కిలోల వరకు బరువు, నల్లని వంపు తిరిగిన ముక్కుతో తెల్లగా కోడి పెట్టలా కనిపిస్తాయి. ముక్కుతో పీతలు, నీటి పాములను పట్టుకుంటాయి. 3 నుంచి 4 గుడ్లు పెట్టి 21 రోజుల్లో పిల్లలను చేస్తాయి.

● **చిన్న నీటికాకులు (లిటిల్ కార్మోరెంట్స్):** ఈ పక్షులు పెద్ద సరస్సులతోపాటు చెరువుల్లో కనిపిస్తాయి. 2 కిలోల వరకు బరువు ఉంటాయి. నీటిలో మునిగి చేపలను వేటాడుతాయి. కాకి అకారంలో నల్లగా ఉంటుంది. 4 గుడ్లు పెట్టి 21 రోజుల్లో పిల్లలను చేస్తాయి.

● **స్పూన్‌బిల్స్(తెడ్డుముక్కు కొంగ):** ఈ పక్షులు ఆస్ట్రేలియా, గుజరాత్ ప్రాంతాల నుంచి వస్తాయి. 2.5 కిలోలు బరువు, పడవ నడిపే తెడ్డులా ముక్కు ఉంటుంది. తలపై నెమలి పించంలా వెంట్రుకలు ఉంటాయి. 3 నుంచి 4 గుడ్లుపెట్టి 21 రోజుల్లో పిల్లలను చేస్తాయి.



అన్నదాత సుఖీభవ

- నేడు పీఎం కిసాన్‌తో కలిపి రూ.7వేల చొప్పున జమ
- జిల్లాలో 2,79,100 మంది రైతులకు లబ్ధి
- నరసన్నపేటలో కార్యక్రమం నిర్వహణకు ఏర్పాట్లు
- హాజరుకానున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీనివాస్, కలెక్టర్

నరసన్నపేట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ రెండో విడత నిధులు బుధవారం విడుదల కానున్నాయి. కడప జిల్లా కమలాపురం నియోజవర్గంలో సీఎం చంద్రబాబునాయుడు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేలు, పీఎం కిసాన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ.2 వేలు మొత్తం రూ.7వేలు చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. జిల్లాకు సంబంధించి నరసన్నపేటలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, స్థానిక ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి చేతులమీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. నరసన్నపేటలోని మార్కెట్‌యార్డు ఆవరణలో రైతులతో సమావేశం నిర్వహిస్తారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ పథకం ద్వారా జిల్లాలో 2,79,100 మంది రైతులకు నిధులు జమ కానున్నాయి. ఎన్నికల హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా ఈ పథకాన్ని అమలు చేస్తోంది. సచివాలయాల వారీగా అర్హుల జాబితాను ప్రచురించింది. ఈకైవైసీతో పాటు ఆధార్ కార్డులు, వెబ్‌ల్యాండ్‌లో తప్పిదాలు సరిచేసేందుకూ గడువు ఇచ్చింది.

● టెక్కలి సబ్‌డివిజన్‌లో అత్యధికంగా..

వ్యవసాయ సబ్‌డివిజన్‌ల వారీ పరిశీలిస్తే టెక్కలిలో అత్యధికంగా నిధులు జమ కానున్నాయి. టెక్కలి సబ్‌డివిజన్ పరిధిలోని నందిగాం, టెక్కలి, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, పాతపట్నం మండలాల్లో 50,301 రైతులకు రూ.35కోట్లు జమ చేస్తారు. ● సోంపేట సబ్‌డివిజన్ పరిధిలోని ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట మండలాల్లో 30,634 మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.21.44 కోట్లు జమ చేయనున్నారు. ● పలాస సబ్ డివిజన్ పరిధిలోని మందస, పలాస, వజ్రపుకొత్తూరు, మెళియపుట్టి మండలాల్లో 38,138 మంది రైతులకు రూ.26.69 కోట్లు జమ కానున్నాయి.

● నరసన్నపేట సబ్‌డివిజన్ పరిధిలోని నరసన్నపేట, పోలాకి, జలుమూరు, సారవకోట మండలాల్లో 37,741 మంది రైతులకు రూ.26.41 కోట్లు జమ కానున్నాయి. ● శ్రీకాకుళం సబ్‌డివిజన్ పరిధిలో శ్రీకాకుళం, గార, ఆమదాలవలస, ఎచ్చెర్ల మండలాల్లో 42,558 మంది రైతులకు రూ.29.79 కోట్లు జమ చేస్తారు. ● రణస్థలం సబ్‌డివిజన్ పరిధిలోని జి.సిగడాం, రణస్థలం, లావేరు. పొందూరు మండలాల్లో 45,464 మంది (మిగతా 6వ పేజీలో..)

డీ-ఫార్మసీలో సీట్ల భర్తీకి నేడు స్పాట్ అడ్మిషన్లు

ఎచ్చెర్ల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల మండలం కుశాలపురం పరిధిలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల (శ్రీకాకుళం)లో 2025-26 విద్యా సంవత్సరంలో డీ-ఫార్మసీలో మిగిలిన సీట్ల భర్తీకి బుధవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డి.విక్టార్ పాల్ తెలిపారు. 'ఇంటర్మీడియట్ బైపీసీ, ఎంపీసీ గ్రూపుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థినులు ఈ కోర్సులో చేరేందుకు అర్హులు. ఆసక్తి గల విద్యార్థినులు ఒరిజనల్ ధ్రువపత్రాలు, మూడు సెట్ల జిరాక్స్‌లతో 19న ఉదయం 9 గంటలకు కళాశాలకు హాజరు కావాలి. సీటు పొందిన విద్యార్థినులకు హాస్టల్ సౌకర్యం ఉంటుంది. ఓసీ, బీసీ విద్యార్థినులు రూ.6,300, ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులు రూ.5.700 చొప్పున అడ్మిషన్ ఫీజు చెల్లించాల'ని ప్రిన్సిపాల్ తెలిపారు.

స్టాఫ్ సమావేశంలో కుప్పకూలి..
● తెలుగు అధ్యాపకుడి హఠాన్మరణం
సముద్రంలో తెప్ప బోల్తా
● మత్స్యకారుడి మృతి.. మరో ఇద్దరు క్షేమం
కర్రెన్న మృతిపై వాస్తవాలు తేల్చాలి
● గ్రానైట్ కార్మికుడి కుటుంబ సభ్యుల ధర్నా
6లో

సెల్‌టవర్ ఎక్కి ఆటోడ్రైవర్ హల్‌చల్

- ప్రభుత్వ పథకం నిధులు అందలేదని ఆవేదన

ఎచ్చెర్ల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల మండలం కుశాలపురం పరిధిలోని యాతపేట వద్ద సెల్‌టవర్ ఎక్కి ఓ ఆటో డ్రైవర్ మంగళవారం హల్‌చల్ చేశాడు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 'ఆటోడ్రైవర్ల సేవలో' పథకం కింద ఆటోడ్రైవర్లకు రూ.15వేలు చొప్పున అందజేసిన విషయం తెలిసిందే. కాగా.. ఎచ్చెర్ల మండలం బొంతలకోడూరు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ దాసరి కళ్యాణ్‌కుమార్‌కు ఈ పథకం కింద నిధులు జమకాలేదు. ఈ నేపథ్యంలో కళ్యాణ్‌కుమార్ మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో యాతపేట వద్ద సెల్‌టవర్ ఎక్కాడు. ఆటో డ్రైవర్లకు ఇచ్చే సాయం తనకు అందలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఆ నిధులు మంజూరుచేసే వరకూ దిగేది లేదంటూ సుమారు గంట సేపు హల్‌చల్ చేశాడు. విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల ఎస్‌ఐ-2 వి.అప్పారావు, పోలీసులు అక్కడికి చేరుకున్నారు. 'ఆటోడ్రైవర్ల సేవలో' డబ్బులు జమయ్యేలా సంబంధిత అధికారులతో మాట్లాడతామని నచ్చజెప్పడంతో కళ్యాణ్‌కుమార్ టవర్ దిగాడు.



సెల్‌టవర్ ఎక్కిన ఆటోడ్రైవర్ కళ్యాణ్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

లక్ష్యాల సాధనలో బ్యాంకర్ల పాత్ర కీలకం

- జిల్లా అభివృద్ధికి సహకరించాలి: కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ లక్ష్యాల సాధనలో బ్యాంకర్ల పాత్ర కీలకమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ప్రభుత్వ శాఖలు, బ్యాంకుల మధ్య సమన్వయం కోసం ఏర్పాటు చేసే జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 'మిల్లర్లకు బ్యాంకు గ్యారంటీలు త్వరితగతిన అందించి వరి కొనుగోళ్లలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలి. సూర్యాఘర్ పథకాన్ని ప్రోత్సహించాలి. రైతులకు ఇచ్చే డ్రోన్ల సంఖ్యను పెంచాలి. వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలు, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు రుణాలు అందజేయాలి. జిల్లా స్థూల ఉత్పత్తి లక్ష్యాలను చేరుకునేందుకు బ్యాంకర్లు సహకరించాలి. స్వయంసహాయక సభ్యులకు వ్యాపార రుణాలు ఇచ్చి, వారి ఆదాయం పెంచాలి. ప్రైవేటు బ్యాంకులు ప్రభుత్వరంగ బ్యాంకులతో సమానంగా రుణాలు మంజూరు చేయాల'ని ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ డి.పృథ్వీరాజ్ కుమార్, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ పేడాడ శ్రీనివాసరావు, డీసీసీ కన్వీనర్ పైడి రాజా, నాబార్డు డీడీఎం రమేష్‌కృష్ణ, ఆర్బీఐ అధికారి నవీన్, అధికారులు, బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

కొత్త కలెక్టరేట్‌లో 84 శాఖలకు గదులు

అరసవల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కొత్తగా నిర్మిస్తున్న సమీకృత కలెక్టరేట్ ప్రాంగణంలో 84 ప్రభుత్వ శాఖలకు గదులు కేటాయింపు ప్రక్రియ కొలిక్కి వచ్చిందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. మంగళవారం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి 84 ప్రభుత్వ శాఖలకు గదుల కేటాయింపుపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 'పాత కార్యాలయాల నుంచి పనికిరాని ఎలక్ట్రానిక్ వ్యర్థాలను తీసుకురావడానికి వీల్లేదు. వాటిని ప్రభుత్వ అనుమతితో వేలం వేయాల'ని తెలిపారు. గ్రౌండ్‌ఫ్లోర్ నుంచి మూడో అంతస్తు వరకు ఏయే శాఖలకు ఏ గదులు కేటాయించారో తగు సూచనలు చేశారు. కొత్త భవనంలోకి మారే ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా సాగేందుకు ప్రతి శాఖ సహకరించాలని తెలిపారు. కొత్త కార్యాలయాలకు సంబంధించి కరెంట్ బిల్లులు ఆయా శాఖలే భరించాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మణమూర్తి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి కె.కావేరి బస్సు బీభత్సం

- ముందు వెళ్తున్న లారీని ఢీకొన్న వైనం
- 8 మందికి గాయాలు
- ఎన్టీఆర్ జిల్లా నందిగామ సమీపంలో ఘటన
- క్షతగాత్రుల్లో జిల్లావాసులు

నందిగామ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా నందిగామ సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం అర్థరాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి శ్రీకాకుళం మీదుగా ఒడిశాకు బయలుదేరిన కావేరి ట్రావెల్స్‌కు చెందిన స్లీపర్ కోచ్ బస్సు అతివేగంతో ఓవర్ టేక్ చేస్తూ ముందు వెళుతున్న లారీని ఢీకొట్టింది. దీంతో బస్సు ధ్వంసమై లోపల ఉన్న 8 మందికి గాయాలయ్యాయి. వీరిలో ఐదుగురికి స్వల్పంగా, ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఘటన జరిగిన వెంటనే డ్రైవర్ పరారు కావడంతో బస్సులో లైట్లు వేసేవారు కూడా లేరు. దీంతో చీకటిలో ఉన్న ప్రయాణికులు ఏం జరిగిందో తెలియక, ఎటు దిగాలో అర్థంకాక అల్లాడిపోయారు. చిమ్మచీకటిలో ప్రయాణికుల కేకలు వినిపించడంతో సమీపంలో పంచర్ల షాపు నడుపుతున్న ఓ యువకుడు హుటాహుటీన అక్కడకు చేరుకొని ఎస్‌బీ కానిస్టేబుల్ విజయ్‌కు సమాచారం అందించాడు. సీఐ వైవివిఎల్ నాయుడు, ఎస్‌బీ కానిస్టేబుల్ విజయ్, పోలీసులు అక్కడకు చేరుకుని క్షతగాత్రులను అంబులెన్స్‌లో విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మిగిలిన ప్రయాణికులను మరో బస్సులో విజయవాడ పంపారు. ముగ్గురు క్షతగాత్రుల్లో ఇద్దరికి హెయిర్‌లైన్ ఫ్రాక్చర్ కాగా, ఒకరికి కాలు విరిగినట్లు స్థానిక వైద్యులు తెలిపారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

క్షతగాత్రులు వీరే

క్షతగాత్రులు శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలతోపాటు ఒడిశా వాసులుగా పోలీసులు గుర్తించారు. శ్రీకాకుళం జిల్లాలో కొత్తూరు మండలం పెద్దగూడ గ్రామానికి చెందిన సవరం నరేష్, సవరం దానియేల్, గుండ్ల సుగుణ(నరసన్నపేట), గుంటా మహేష్ (సారవకోట), సవర సంతోష్(శ్రీకాకుళం) గాయపడ్డారు. అలాగే ఒడిశా రాష్ట్రానికి చెందిన బైరాగి మురుగన్‌దాస్, మితా దాసుతోపాటు బేవర సతీష్‌కుమార్(విజయనగరం జిల్లా డెంకాడ)కు గాయాలయ్యాయి. బాధితుల్లో ఒకరైన సవ రం నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఉపాధి కోసం హైదరాబాద్ వెళ్లిన తామంతా సోమవారం రాత్రి ఏడు గంటలకు హైదరాబాద్ నుంచి కావేరి ట్రావెల్స్‌కు చెందిన ఏఆర్ 20ఈ1655 బస్సులో శ్రీకాకుళం బయలుదేరామన్నారు. డ్రైవర్ అతివేగంగా బస్సును నడుపుతూ ప్రమాదానికి కారణమయ్యాడని చెప్పారు. క్షతగాత్రులను ఆదుకోవాలని కోరారు.



ధ్వంసమైన బస్సును పరిశీలిస్తున్న పోలీసులు

తీరానికి వెలుగులు

- సముద్రతీర ప్రాంతాల్లో సోలార్‌లైట్లు
- మత్స్యసాగరమాల ప్రాజెక్టులో భాగంగా ఏర్పాట్లు

పాత శ్రీకాకుళం/ సోంపేట రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సముద్ర తీరప్రాంతాలు, మత్స్యకార గ్రామాల్లో సోలార్ వెలుగులు విరజిమ్ముతున్నాయి. మత్స్యసాగరమాల ప్రాజెక్టులో భాగంగా జిల్లావ్యాప్తంగా తీరప్రాంతాల్లో 2,600కుపైగా సోలార్ లైట్లు అమర్చాలని అధికారులు నిర్ణయించారు. తొలివిడత 1,594, రెండో దశలో 1,006 లైట్లు ఏర్పాటు చేసే దిశగా ప్రణాళికలు రూపొందించారు. ఈ మేరకు జిల్లాలోని 122 తీరప్రాంత గ్రామాలు, బీచ్ అనుసంధానం రోడ్లు, తీరం వెంబడి వీటిని ఏర్పాటు చేస్తున్నారు. మొదటిదశలో భాగంగా ఇచ్ఛాపురం, శ్రీకాకుళం, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లో 1,516 సోలార్ లైట్లు అమర్చారు. శ్రీకాకుళం రూరల్ పెద్దగణగళ్లవానిపేట, సోంపేట మండలం ఎర్రముక్కాం తదితర తీరప్రాంతాల పొడవునా విద్యుత్ కాంతులు వెలుగుతున్నాయి.



సోంపేట రూరల్: ఎర్రముక్కాం తీరంలో సోలార్ వెలుగులు



శ్రీకాకుళం : పెద్దగణగళ్లవానిపేట తీరంలో సోలార్ కాంతులు



రెండోదశలో నరసన్నపేట, పోలాకి తదితర మండలాల్లో పనులు ప్రారంభించనున్నారు. ఒక్కో సోలార్ లైటు విలువ సుమారు రూ.27వేలు. సెన్సార్ బేస్డ్ సోలార్ లైట్లు 15 నుంచి 17ఏళ్ల వారెంటీతో, తుఫాన్ సమయంలో గాలులను తట్టుకునే విధంగా, ఉదయం సూర్యకాంతి ద్వారా చార్జింగ్ అయి రాత్రి సమయంలో కాంతిని అందిస్తాయి, జనసంచారం తక్కువగా ఉన్నప్పుడు కాంతి తగ్గి (మిగతా 7వ పేజీలో..)

స్టాఫ్ సమావేశంలో కుప్పకూలి..

- తెలుగు అధ్యాపకుడి హఠాన్మరణం
- ఆర్ట్స్ కళాశాలలో ఘటన


వెంకటరమణ (ఫైల్)

శ్రీకాకుళం క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తోటి అధ్యాపకులను అప్యాయతగా పలకరిస్తూ విద్యార్థులను ఆకట్టుకునేలా బోధన చేస్తూ ఉండే ఆర్ట్స్ కళాశాల తెలుగు అధ్యాపకుడు పప్పల వెంకటరమణ (55) మంగళవారం స్టాఫ్ మీటింగ్‌లో కూర్చొన్న కుర్చీలోనే మృతి చెందిన ఘటన తోటి అధ్యాపకులను, విద్యార్థులను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. అధ్యాపకులు తెలిపిన వివరా లిలా ఉన్నాయి.. పొందూరు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన పప్పల వెంకటరమణ 2017 సంవత్సరం ఆమదాలవలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల కళాశాల (ఆర్ట్స్)కు బదిలీపై వచ్చారు. గత ఏడేళ్లుగా ఇక్కడే తెలుగు అధ్యాపకుడిగా పని చేస్తున్నారు. ఎప్పటిలాగే మంగళవారం ఉదయం 9.30 గంటల ప్రాంతంలో కళాశాలకు వచ్చి పది గంటల నుంచి 11 గంటల వరకు బీకాం మొదటి సంవత్సరం విద్యార్థులకు పాఠం చెప్పారు. అయితే ఈనెల 14న ప్రిన్సిపాల్‌గా జాయిన్ అయిన డాక్టర్ వై.పోలినాయుడు ఉదయం 11 గంటలకు స్టాఫ్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న వెంకటరమణ కొద్ది సేపటిలోనూ ఒక్క సారిగా కుప్పకూలిపోయి నాలుకను బయటకు పెట్టి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. దీనిని గమనించిన తోటి అధ్యాపకులు వెంటనే డేఅండ్‌నైట్ కూడలి వద్ద ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వెంకటరమణను వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. మృత దేహాన్ని ధర్మవరంలో ఉన్న స్వగృహానికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

సముద్రంలో తెప్ప బోల్తా

- మత్స్యకారుడి మృతి.. మరో ఇద్దరు క్షేమం
- గుప్పెడుపేట తీరంలో ఘటన


రాజారావు (ఫైల్)

పోలాకి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సముద్రంలో తెప్పబోల్తాపడిన ప్రమాదంలో ఓ మత్స్యకారుడు మృతి చెందగా, మరో ఇద్దరు క్షేమంగా బయటపడ్డారు. ఈ ఘటన గుప్పెడుపేట తీరంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. గుప్పెడుపేటకు చెందిన మత్స్యకారులు చెక్క రాజారావు (45), చెక్క హరయ్య, తులే సింహాచలం మంగళవారం ఉదయం తెప్పపై సముద్రంలోకి వేటకు వెళ్లారు. కొంత సేపటికే తెప్పబోల్తాపడి మునిగిపోయింది. దీంతో రాజారావు గల్లంతు కాగా మిగతా ఇద్దరు ఈదుకుంటూ తీరానికి చేరుకున్నారు. కొద్దిసేపటి తరువాత రాజారావు మృతదేహం తీరానికి కొట్టుకొచ్చింది. రాజారావుకు భార్య చెల్లెమ్మ, కుమార్తె సుష్మిత, కుమారులు గోవింద, చరణ్ ఉన్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. శవపంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసన్నపేట ఆస్పత్రికి తరలించారు. భార్య చెల్లెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి.రంజిత్ తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

టెక్కలి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): లింగాలవలస పంచాయతీ సన్యాసిపేట గ్రామానికి చెందిన జన్ని రాధ(28) అనే వివాహిత మంగళవారం శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతిచెందిందని టెక్కలి పోలీసులు తెలిపారు. ఆమె ఇంటి వద్ద సోమవారం అస్వస్థతకు గురికాగా టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి స్థానికులు తరలించారు. వైద్యులు ఆమెను మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ మేరకు టెక్కలి పోలీసులు కేసు నమోదుచేశారు.

కర్రెన్న మృతిపై వాస్తవాలు తేల్చాలి

- ఆస్పత్రి ఎదుట గ్రానైట్ కార్మికుడి కుటుంబ సభ్యుల ధర్నా


టెక్కలి ఆసుపత్రి వద్ద ధర్నా చేస్తున్న జలగలింగుపురం గ్రామస్థులు

టెక్కలి/మెళియాపుట్టి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టి మండలం పడ్డ పంచాయతీ పరిధిలోని ఓ గ్రానైట్ క్వారీలో జలగలింగుపురం గ్రామానికి చెందిన కార్మికుడు రాణ కర్రెన్న(45) మృతి చెందడంపై పలు అనుమానాలు ఉన్నాయని సర్పంచ్ ప్రతినిధి రవ్వల గణపతి, జనసేన నాయకుడు దుక్క బాలరాజు, గ్రామ యువజన సంఘం నాయకుడు కొల్లి వాసు అన్నారు. కర్రెన్న మృతిపై వాస్తవాలు తేల్చాలని డిమాండ్ చేస్తూ మంగళవారం టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రి వద్ద మృతుని కుటుంబసభ్యులు, గ్రామస్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్వారీ పనులకు ఉత్సాహంగా బయలుదేరి వెళ్లిన కర్రెన్న మృతిచెందడంపై పలు అనుమానాలు ఉన్నాయన్నారు. క్వారీ యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. తమకు న్యాయం జరిగే వరకూ పోస్టుమార్టంకు ఒప్పుకొనేది లేదంటూ ఆందోళన చేశారు. దీంతో పాతపట్నం సీఐ సన్యాసినాయుడు, మెళియాపుట్టి ఎస్ఐ రమేష్‌బాబు ఆసుపత్రి వద్దకు వచ్చి వారితో చర్చలు జరిపారు. గ్రానైట్ యాజమాన్యం ఆర్థిక సాయం చేసేందుకు ముందుకురాకపోడంతో గత రెండురోజులుగా మృతదేహం మార్చురీలోనే ఉంది.

త్రుటిలో తప్పిన ప్రమాదం


ట్రాక్టర్ చక్రం విరగడంతో రోడ్డుపై పడిన రాయి పిక్కలు

పొందూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పొందూరు అంబేడ్కర్ కూడలిలో క్వారీ చిప్స్ లోడుతో వెళుతున్న ట్రాక్టర్ చక్రం విరిగింది. అయితే ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమీ కాలేదు. ఈ ప్రమాదాన్ని చూసిన ప్రతి ఒక్కరూ ఇటీవల చేవెళ్లలో జరిగిన ఘటనను గుర్తు చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.. రాపాక కూడలి నుంచి రాజాం వైపు క్వారీ చిప్స్ లోడుతో వెళుతున్న ట్రాక్టర్ అంబేడ్కర్ కూడలిలోని స్పీడ్ బ్రేకర్‌ను దాటే క్రమంలో వెనుకవైపు చక్రం విరిగిపోయింది. దీంతో ఒక్కసారిగా రోడ్డు మధ్యభాగం వైపు ఒరిగిపోయి తలుపు ఊడడంతో చిప్స్(రాయి పిక్కలు) రహదారిపై పడ్డాయి. ఆ సమయంలో అటువైపుగా ఎటువంటి వాహనం రాకపోవడంతో ప్రమాదం తప్పింది. పరిమితికి మించిన లోడులతో క్వారీ వాహనాలు తిరుగుతూ రోడ్లపై రాళ్లు పడుతున్నాయి. ఇప్పటికైనా పోలీసులు, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వలస మత్స్యకారుడికి గాయాలు

కవిటి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పొట్టకూటికోసం వలస వెళ్లిన మత్స్యకారుడికి అనుకోని ప్రమాదం జరిగి తీవ్రగాయాలపాలయ్యాడు. గ్రామస్థులు తెలిపిన వివరాలి ఉన్నాయి.. పెద్ద కపాసుకుద్ది గ్రామానికి చెందిన వంక చంద్రరావు గుజరాత్ వలస వెళ్లాడు. అక్కడ తోటి మత్స్యకారులతో కలిసి ఆదివారం బోటులో వేటకు వెళ్లగా వంటకు ఉపయోగించే గ్యాస్ స్టౌవ్ పేలింది. దీంతో శరీరమంతా కాలిపోయి తీవ్రగాయ్యాయని గ్రామస్థులకు మంగళవారం సమాచారం అందింది. వెంటనే తోటి మత్స్యకారులు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే బాధితుడికి అవసరమైన సర్జరీలు చేయాలని, అందుకు ఖర్చు అవుతుందని వారు తెలియజేయడంతో కుటుంబ సభ్యులు లబోదిబోమంటున్నారు.

ప్రతి ధాన్యం గింజా కొనుగోలు చేస్తాం

- దళారులకు విక్రయించి రైతులు నష్టపోవద్దు
- ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

జలుమూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వం మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తుందని, దళారులకు విక్రయించి నష్టపోవద్దని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. చల్లవానిపేట సొసైటీలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు అభ్యున్నతే కూటమి ప్రభుత్వం ధ్యేయమన్నారు. మండలంలో 21 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు చెప్పారు. గ్రేడు-ఏ రకం ధాన్యం క్వింటా రు.2,389, 80 కేజీల బస్తా రు.1,792, సాధారణ రకం క్వింటా రూ.2,369, 80 కేజీల బస్తా రు.1,777కు ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నట్లు వివరించారు. ధాన్యం మిల్లర్లకు చేరిన 24 గంటల్లో నగదు రైతుల ఖాతాకు జమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త బగ్గు అర్చన, చల్లవానిపేట, అల్లాడ సొసైటీల చైర్మన్‌లు దుంగ స్వామిబాబు, వెలమల రాజేంద్రనాయుడు, వ్యవసాయశాఖ ఏడీ ఎల్.వి.మధు, తహసీల్దార్ జె.రామారావు, ఎంపీడీవో బి.చిన్నమ్మడు, వ్యవసాయాధికారి కె.రవికుమార్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

మాది రైతు ప్రభుత్వం: ఎమ్మెల్యే శిరీష


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

పలాసరూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అన్నదాతల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ రైతు ప్రభుత్వంగా గుర్తింపు పొందామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. రెంటికోటలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి ఆమె మాట్లాడారు. చివరి ధాన్యం వరకూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. గ్రామంలోని కోనేరును బాగు చేయాలని రెంటికోట గ్రామస్థులు కోరడంతో ఆమె ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. కోనేరు అభివృద్ధికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పీరుకట్ల విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావుయాదవ్, వ్యవసాయ ఏడీ రామారావు, పీఏసీఎస్ చైర్మన్ వంకల కూర్మారావు, తహసీల్దార్ కళ్యాణచక్రవర్తి, నాయకులు దువ్వాడ సంతోష్, గురిటి సూర్యనారాయణ, గంగారామ్, సర్పంచ్ ఎస్.మోహనరావు, హరియా మోహనరావు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

- ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్

కొత్తూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే రోగులకు సిబ్బంది మెరుగైన సేవలు అందించాలని సీతంపేట ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ సూచించారు. మంగళవారం కొత్తూరు సామాజిక ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పరిసరాలను పరిశీలించి రోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో తగినంతగా వసతి, బెడ్స్ లేవని రోగులు పీవో దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన స్పందిస్తూ కొత్త భవనం ప్రారంభమయ్యే వరకు రోగులు సహకరించాలని కోరారు. విధుల్లో ఒక్క వైద్యుడే ఉండటంతో మిగిలిన వైద్యులు, సిబ్బంది ఎక్కడికి వెళ్లారని ఆరా తీశారు. రోగులకు సకాలంలో మెరుగైన సేవలు అందించాలని.. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆసుపత్రి ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న భవనం పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యతా లోపం లేకుండా ఇంజనీరింగ్ సిబ్బంది పర్యవేక్షించాలని ఆయన సూచించారు.

ప్రైవేటు వైద్యునికి మందలింపు

అంతకుముందు కొత్తూరులో ఉన్న ప్రయివేటు ఆసుపత్రులను పరిశీలించారు. ఇటీవల కాలంలో ఒక ప్రయివేటు ఆసుపత్రిలో ఇంజక్షన్ వికటించి ఒకరు మృతి చెందడం.. మరో విద్యార్థినికి సకాలంలో వైద్యం అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించటం వల్ల మృతి చెందిన సంఘటనల నేపథ్యంలో పీవో స్వయంగా ఆస్పత్రులను పరిశీలించారు. ప్రయివేటు వైద్యుడు నాగేశ్వరావును మందలించారు. ఎటువంటి అర్హతలు లేకుండా వైద్య అందించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. ఇక నుంచి ప్రథమ చికిత్స వరకే పరిమితం కావాలి తప్ప.. వైద్యం చేసేందుకు ప్రయత్నిస్తే క్రిమినల్ కేసులు నమోదుకు ఆదేశిస్తామని హెచ్చరించారు. పీవో పరిశీలిస్తున్నారని తెలియడంతో మిగిలిన ప్రయివేటు ఆసుపత్రులు, ల్యాబ్‌ల సిబ్బంది కనిపించకుండా పోయారు. పీవోతో పాటు ఇన్‌చార్జి తహసీల్దార్ సీహెచ్ భీమారావు, కురిగాం ఆసుపత్రి వైద్యాధికారి పెద్దిన ప్రసన్న కుమార్, ఈఈ రమాదేవి, డీఈ సిమ్మన్న తదితరులు పాల్గొన్నారు. ●మెట్టూరు ఆసుపత్రి సమస్యలను పీవోకు వివరించినట్టు నిర్వాసితుల సంఘ అధ్యక్షులు బూర్లె శ్రీనివాసరావు తెలిపారు. స్థల వివాదంతో అక్కడ ఆసుపత్రి భవన నిర్మాణం నిలిచిపోయిందని... దీనితో పంచాయతీ కార్యాలయంలో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. పీవో స్పందిస్తూ.. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.


సిబ్బందితో మాట్లాడుతున్న పీవో

ఎయిర్‌పోర్టును వెంటనే రద్దు చేయాలి


నినాదాలు చేస్తున్న రైతులు

హరిపురం, నవంబరు 18 ఆంధ్రజ్యోతి): మందస మండలం ఉద్దానం ప్రాంతంలో నిర్మించ తలపెట్టిన కార్గో ఎయిర్‌పోర్టును వెంటనే రద్దు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. బిడిమి సామాజిక భవనంలో మంగళవారం ఎయిర్‌పోర్టు బాధిత రైతుల సంఘం అధ్యక్షుడు కొమర వాసు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పచ్చని తోటల్లో ఎయిర్‌పోర్టును ఏర్పాటు చేసి తమ బతుకులు నాశనం చేయవద్దని అన్నారు. పలాస ఆర్డీవో కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాకు అనుమతిని పోలీసులు నిరాకరించడంతో సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో జోగి అప్పారావు, గుంటు రామస్వామి, దున్న హరికృష్ణ, చిత్త గున్నయ్య, సాంబమూర్తి, బత్తిని లక్ష్మణ్, ధర్మారావు, మామిడి తులసయ్య, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్బంధం సరికాదు


వామపక్ష నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

పలాసరూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఉద్దానంలో ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన కార్గో ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా ధర్నా చేసేందుకు సిద్ధపడుతున్న వారిని పోలీసులు అక్రమంగా నిర్బంధించడం సరికాదని వామపక్ష నాయకులు అన్నారు. మండలంలోని మాకన్న పల్లి వద్ద మంగళవారం సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావును పోలీసులు అదుపులోకి తీసుకుని సోంపేట పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పలువురు వామపక్ష నాయకులు మాట్లాడుతూ.. ధర్నా కోసం ముందస్తుగానే పోలీసుల అనుమతి కోరితే, చివరి రోజు అనుమతి లేదని నిరాకరించడం ప్రభుత్వ నియంతృత్వ ధోరణికి నిదర్శనమన్నారు. తక్షణమే పోలీసుల నిర్బంధంలో ఉన్న వామపక్ష నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు మద్దిల మల్లేశ్వరరావు, రామారావు, కె.దుష్యంత్, పి.అప్పారావు, కె.ఈశ్వరమ్మ, లోకనాథం, నాగేశ్వరరావు, కె.వల్లభరావు, కైలాస్, జగదీష్ పాల్గొన్నారు.

కురుడు పాఠశాల జిల్లాకే ఆదర్శం: డీఈవో


గాంధీ విగ్రహాన్ని ప్రారంభిస్తున్న డీఈవో

కోటబొమ్మాళి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కురుడు జడ్పీ ఉన్నత పాఠశాల జిల్లాకే ఆదర్శంగా నిలుస్తుందని డీఈవో ఎ.రవిబాబు అన్నారు. మంగళవారం కురుడు పాఠశాల ఆవరణలో పలువురు దాతల ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య సమర యోధులు, జాతీయ నాయకులు, కవులు, శాస్త్రవేత్తలు, క్రీడాకారులు, స్థలదాతలకు సంబంధించి 14 మంది విగ్రహాలను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. ఇంతమంది మహనీయుల విగ్రహాలు ఏ ప్రభుత్వ పాఠశాలలో లేవన్నారు. ఈ విగ్రహాలను పలవురు దాతలు, ఉపాధ్యాయులు అందజేయడం సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో టెక్కలి ఉప విద్యాశాఖాధికారి విలియమ్స్, మండల విద్యాశాఖాధికారి గోవిందరావు, రిటైర్డ్ ఎంఈవో ఎల్.వి. ప్రతాప్, గ్రామ పెద్దలు జి.నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి సోమేశ్వరరావు మృతి


సోమేశ్వరరావు (ఫైల్)

హరిపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మందస మండలం విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఎరుకోల సోమేశ్వరరావు (65) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. హరిపురం గ్రామానికి చెందిన ఈయన బాహడపల్లితో పాటు పలు ఉద్దానం గ్రామాల్లో ఉపాధ్యాయునిగా పనిచేశారు. పేద విద్యార్థులకు పరీక్ష ఫీజు చెల్లించడంతోపాటు ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారు. హరిపురం హైస్కూల్‌లో తన తల్లిపేరుతో కళాభవనం నిర్మించారు. ఉన్నత విద్యాభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సోమేశ్వరరావు మృతి పట్ల పలువురు విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు, హరిపురం లైన్స్ క్లబ్, యువజన సంఘ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం

హిరమండలం, నవంబరు18(ఆంధ్రజ్యోతి): హిరమండలానికి చెందిన కళింగపట్నం గురునాథ్ అనే క్యాన్సర్ బాధితుడికి మంగళవారం ఏపీజే అబ్దుల్ కలాం ఫౌండేషన్ ద్వారా రూ.10వేలు నగదు, 25 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు శరత్ చంద్రపాడీ, బలగ బాలామణి పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 14మందికి గాయాలు

పలాస/రూరల్,నవంబరు18(ఆంధ్రజ్యోతి): తాళభద్ర జంక్షన్, తిలక్‌నగర్, రైల్వే స్టేషన్ దరిలో మంగళవారం రాత్రి కుక్కలు సైర్వ విహారం చేశాయి. 14 మందిపై దాడి చేసి గాయపరిచాయి. పి.గాయత్రి, వల్లభరావు, నిరంజన్, బబి భాను, వెంకట రమణమూర్తి, కె.లత, దుర్యోధన, రాజేష్‌కుమార్, లత, సునీల్‌కుమార్,చంద్రకళ, జగన్నాయకులు, దేవ, వై.వినోద్ కుక్కగాట్లతో స్థానిక ఆసుపత్రిలో చేరి ఇంజక్షన్లు వేయించుకున్నారు. పలాస రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలో కుక్కల సంచారం అధికంగా ఉండడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల బెడద లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

అనధికార దత్తత చట్టరీత్యా నేరం

కోటబొమ్మాళి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అనధికార దత్తత చట్టరీత్యా నేరమని జిల్లా బాలల రక్షణ విభాగం ముఖ్య కౌన్సిలర్ డి.సీతారాములు అన్నారు. మంగళవారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సీడీపీవో సీహెచ్ శ్యామావతి ఆధ్వర్యంలో పిల్లల దత్తతపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గ్రామస్థాయిలో ఏర్పాటు చేసిన బాల రక్షణ కమిటీలు, బాల్యవివాహాల నిరోధక కమిటీలను బలోపేతం చేయాలన్నారు. చైల్డ్‌హెల్ప్ లైన్ కౌన్సిలర్ ఎం.సునీత, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

బాలల హక్కులను రక్షించాలి

నరసన్నపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కులను రక్షించాలని జిల్లా బాలల రక్షణ విభాగం ప్రతినిధి ఎ.గీతా అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో అనాథ పిల్లల దత్తతపై అవగాహన సదస్సు నిర్వహించారు. అవాంఛిత గర్భం దాల్చిన వారు పిల్లలను వద్దనుకుంటే బయటగాని, చెత్తకుప్పల్లో వేయవద్దని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏర్పాటు చేసిన ఊయల్లో వేయాలని అన్నారు. పిల్లలను చట్టబద్ధంగా దత్తత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జనార్దనరావు, పీవో శోభారాణి, సూపర్‌వైజర్ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనంతోనే ప్రగతి సాధ్యం

నందిగాం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పచ్చదనం.. పరిశుభ్రతతోనే ప్రగతి సాధ్యపడుతుందని ఇన్‌చార్జి ఎంపీడీవో పి.హరికృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు టీమ్-5 పచ్చదనం.. పరిశుభ్రతపై ఒక్కరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై డీపీఆర్‌సీ రిసోర్స్‌పర్సన్ పి.ఆనందరావు, మాస్టర్ ట్రైనీ కె.గోపినాథ్ వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శుల సంఘ ప్రతినిధులు కె.రమణబాబు, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజశ్యామల యాగం

ఎల్.ఎన్.పేట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): లక్ష్మీనర్సుపేటలోని బంగారమ్మతల్లి ఆలయం వద్ద మంగళవారం నవచండీ సహిత రాజశ్యామలా యాగం ఘనంగా నిర్వహించారు. భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలను స్వీకరించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నిర్వాహకులు వి.చంద్రశేఖరరాజు, వి.పాండురంగనాధరాజు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దళితులపై దాడులను అరికట్టాలి



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

జలుమూరు (సారవకోట), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దళిత, గిరిజన, మైనారిటీలపై దాడులను తక్షణమే అరికట్టాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొన్న శ్రీనివాస్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సామాజిక న్యాయం, సమానత్వ సాధన, ఆత్మ గౌరవం కోసం దేశ వ్యాప్త ఆందోళన చేయాలని సీపీఐ జాతీయ సమితి పిలుపు ఇచ్చిందన్నారు. ప్రజాస్వామ్య హక్కులను హరించే శక్తులను తిప్పికొట్టేందుకు సమైక్యంగా ఉద్యమించాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు తిరుపతిరావు, సీహెచ్ లవకుమార్, భాస్కరరావు, వసంత, ధర్మారావు, యశోద తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో భవిష్యత్ నాశనం



మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

పలాస, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలతో భవిష్యత్ నాశనం అవుతుందని, దీన్ని పూర్తిగా నిర్మూలించేందుకు విద్యార్థులు విస్తృత ప్రచారాలు చేయాలని అధ్యాపకులు పిలుపునిచ్చారు. నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎన్ఎస్ఎస్ పీవోలు కొండల మధుబాబు, తమ్మినేని వాసుదేవరావు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ

(ఐదో పేజీ తరువాయి)

రైతులకు రూ.31.82కోట్లు జమ కానున్నాయి. ● కొత్తూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని బూర్జ, హిరమండలం, కొత్తూరు, సరుబుజ్జిలి, ఎల్.ఎన్.పేట మండలాల్లో 34,264 మంది రైతులకు రూ.23.98కోట్లు జమ చేయనున్నారు. తొలివిడత జమకాని రైతుల నుంచి కూడా అధికారులు ఫిర్యాదులు స్వీకరించారు. వాటిని పరిశీలించి అర్హులందరికీ ఈ పథకం కింద నిధులు జమచేయనున్నారు.

నేటి నుంచి సత్యసాయి జయంత్యుత్సవాలు

పోలాకి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయిబాబా జయంత్యుత్సవాలు బుధవారం నుంచిప్రారంభమవుతాయని కమిటీ నిర్వాహకులు బరాటం రామారావు, రమణయ్య తెలిపారు. ఉదయం పోలాకిలోని సత్యసాయి మందిరం వద్ద ప్రత్యేక పూజల అనంతరం గర్భిణులకు సీమంతాలు, ఫలదానాలవంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. స్వయంశక్తిసంఘాల మహిళలు, సత్యసాయి కమిటీ సభ్యులు విధిగా హాజరుకావాలని వారు కోరారు.

ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ

పాతపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్‌హబ్ ద్వారా ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కొండాల చక్రపతి తెలిపారు. సైబర్ సెక్యూరిటీ కోర్సులో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తామని, ఆసక్తిగల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంటర్మీడియట్ విద్యార్హత ఉన్నవారు అర్హులని చెప్పారు. అభ్యర్థులు ధ్రువపత్రాలతో స్కిల్ హబ్‌ను సంప్రదించాలని తెలిపారు. వివరాలకు 9553292734 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పల్లాను కలిసిన టీడీపీ నేతలు

కొత్తూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును మండల నాయకులు మంగళవారం విశాఖపట్నంలోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు పార్టీ మండల అధ్యక్షుడు ఎ.మాధవరావు తెలిపారు. ఆయనతో పాటు పీఏసీఎస్ అధ్యక్షుడు మాతల గాంధీ, నాయకులు అగతముడి అరుణకుమార్, నూలు వీరభద్రస్వామి, మోహనరావు, విశ్వనాథులు షన్ముఖరావు, తదితరులు ఉన్నారు.

'ఆవాస్ ప్లస్'ను వినియోగించుకోవాలి

పలాసరూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సొంత స్థలం ఉన్న వారు ఆవాస్ ప్లస్ పథకాన్ని వినియోగించుకోవాలని సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టు సీహెచ్.మల్లేశ్వరరావు కోరారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం మహిళా సంఘాల సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పథకం పొందేందుకు సొంత స్థలం గుర్తింపు పత్రం, ఆధార్, కుల, ఆదాయ ధ్రువపత్రాలు, బ్యాంకు పాస్‌బుక్‌తో సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏపీఎం జాంబవతి, సీసీలు నాగమ్మ, తేజేశ్వరరావు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శాంతమ్మ పాల్గొన్నారు.

ఒత్తిడిలేని బోధన అందించాలి

పాతపట్నం/రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఒత్తిడి లేని బోధన అందించాలని అసిస్టెంట్ కమిషనర్, ఎగ్జామినర్ చంద్రభూషణ్ అన్నారు. సీది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. విద్యార్థులకు పరీక్షల నిర్వాహణ, బుక్‌లెట్స్, ప్రగతి కార్డులు, వాటిలో నమోదు ప్రక్రియ, విద్యార్థుల గ్రేడింగ్, తరగతి గదిలో ప్రగతి, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు విద్యార్థులు, ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. హెచ్ఎం బి.సింహాచలం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అపరాలు సాగు చేసుకోవాలి

మందస, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రైతులు రబీలో పెసర,మినుము వంటి అపరాలను సాగు చేసుకోవాలని ఎఫ్ఎంటీఎస్ అధికారులు సూచించారు. స్థానిక ఆర్డీఎస్ భవనంలో రబీలో వివిధ రకాల అపరాలను ఏ విధంగా కిట్‌గా తయారు చేయాలో మంగళవారం రైతులకు వారు వివరించారు. 12 రకాల విత్తనాల సాగుపై వివరించారు. రైతుల సమక్షంలోనే పెసర, మినుముల కిట్లు, నువ్వులు వేసే విధానంపై వివరించారు. కార్యక్రమంలో రీజనల్ టీమ్ లీడర్ ప్రకాశ్,హేమసుందర్, ఐసీఆర్‌పీఎస్ రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజాదర్బార్

పాతపట్నంరూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఐదు మండలాలకు చెందిన ప్రజలు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. వాటిని పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేడు మాక్ డ్రిల్

టెక్కలి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): తలగాం రైల్వే క్రాసింగ్ పోర్టు రోడ్డు సమీపంలో బుధవారం ఐవోసీఎల్ పైపులైన్‌కు సంబంధించి మాక్ డ్రిల్ నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు సత్తారు మల్లేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. పైపులైన్ లీకై మంటలు వ్యాపిస్తే ఎలా అదుపుచేయాలో వివవరిస్తామన్నారు. ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, అగ్నిమాపక అధికారులు, పాల్గొంటారని చెప్పారు.

ప్రధాని మోదీ ఆలోచనలతో ముందుకు వెళ్లాలి

● జిల్లాకు చేరిన సైకిల్ యాత్రికుడు దీపక్ శర్మ



సైకిల్ యాత్రికుడు

కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రధాని మోదీ ఆలోచనలతో మనమంతా ముందుకు వెళ్లాలని సైకిల్ యాత్రికుడు దీపక్ శర్మ అన్నారు. వారాణసి నుంచి చార్ ధామ్ వరకు సుమారు 15 వేల కిలోమీటర్ల సైకిల్ యాత్ర చేస్తూ మంగళవారం శ్రీకాకుళం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్ విజయాన్ని దేశ ప్రజలకు గుర్తు చేయడంతో పాటు నీటిని పొందుపుగా వాడడం, స్వదేశీ వస్తువులను వినియోగించడం తదితర అంశాలపై ప్రధాని ఆలోచలను ప్రచారం చేస్తూ ఈ యాత్ర చేపడుతున్నామన్నారు. ఆయనకు శ్రీకాకుళంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవలాపురపు వెంకటరమణ మాదిగ పూలమాల వేసి శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు మురళీ, పవన్, సవలాపురపు లక్ష్మి పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లను ప్రోత్సహించాలి: అవినాష్



మాట్లాడుతున్న డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పీఏసీఎస్‌లను ప్రోత్సహించాలని ఆ సంస్థ జిల్లా చైర్మన్ చౌదరి అవినాష్ అన్నారు. డీసీ ఎంఎస్ 72వ అఖిల భారత వారోత్సవాలను మంగళ వారం ప్రారంభించారు. కార్యాలయ ఆవరణలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ.. సంస్థను బలోపేతం చేసేందుకు కేంద్రమంత్రి అమిత్‌షా, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చె న్నాయుడు కృషి చేస్తున్నారన్నారు. సంస్థకు చెందిన ఖాళీ స్థలాలు, గోదాంలను వ్యాపారాభివృద్ధికి ఉపయోగిస్తామని, అందులో భాగంగా అరసవల్లిలో ఫంక్షన్ హాల్, మినీ క్రికెట్ స్టేడియం నిర్మాణం చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కోపరేటివ్ అధికారి బి.మురళీకృష్ణ, ఆడిట్ అధికారి చంటిబాబు, టెక్కలి అధికారి మురళీకృష్ణ, ఆఫీసు సూపరింటెండెంట్ కె.దామోదరరావు, జగ్గునాయుడు పాల్గొన్నారు.

తీరానికి వెలుగులు

(ఐదో పేజీ తరువాయి)

అవసరమైతే కాంతి పెరిగే విధంగా వాటిని ఏర్పాటు చేశారు.

కేంద్రమంత్రి చొరవతో..

కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు చొరవతో మత్స్యసాగరమాల ప్రాజెక్టు అమలుకు శ్రీకారం చుట్టారు. గత ఎన్నికల ప్రచార సమయంలో రామ్మోహన్‌నాయుడు బారువలో పర్యటించారు. ఆ సమయంలో మత్స్యకారులు రాత్రివేళ రాకపోకలు, సురక్షితంగా పడవలు ఒడ్డుకు చేర్చడం, తీరప్రాంత రహదారులు వినియోగం వంటి అంశాలను దృష్టిలో పెట్టుకున్నారు. ఒక బృందాన్ని ఏర్పాటు చేసి మత్స్యకార గ్రామాల్లో సర్వే చేయించారు. ప్రతి గ్రామానికి ఎన్ని సోలార్ లైట్లు అవసరమో ప్రణాళికలు రచించారు. ఈ మేరకు వాటిని ఏర్పాటు చేస్తుండడంతో మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 'గతంలో ఎటువంటి సదుపాయం లేకపోవడంతో వేటకు వెళ్లేటప్పుడు ఇబ్బందులు పడేవాళ్లం. పర్యాటకులు కూడా ఇటుగా వచ్చే పరిస్థితి లేదు. సీసీ రోడ్లు ఏర్పాటు చేసి సోలార్ లైట్లు అమర్చడంతో మా గ్రామాలకు కొత్త వెలుగులు వచ్చాయి. సోలార్ వెలుగులు కారణంగా రాత్రివేళ మాకు ఎంతో భద్రత లభిస్తోంద'ని మత్స్యకారులు పేర్కొంటున్నారు. మత్స్యసాగరమాల ప్రాజెక్టును చేపట్టినందుకు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు.

తేలినీలాపురంలో విదేశీ పక్షులు

(ఐదో పేజీ తరువాయి)

పట్టించుకోకపోవడంతో అధ్వానంగా మారింది. కేంద్రం చుట్టూ ప్రహరీ, విదేశీ పక్షులను చూసే టవర్లు పాడైపోయాయి. మరుగుదొడ్లు, తాగునీటి వసతి కూడా లేదు. దీంతో విడిది కేంద్రానికి వచ్చిన పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. చిల్డ్రన్ పార్క్ కూడా మూతపడడంతో చిన్నారులు ఆడుకునేందుకు వీల్లేకుండా పోయింది. ఇటీవల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఈ కేంద్రాన్ని పరిశీలించారు. దీనిని అభివృద్ధి చేసేందుకు అంచనాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు పక్షుల సంరక్షణతోపాటు పర్యాటకులకు సౌకర్యాలు కల్పించేలా అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

మందులతో హెచ్ఐవీ తీవ్రత తగ్గించొచ్చు

● జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హరిబాబు

శ్రీకాకుళం లీగల్ నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీకి చికిత్స లేనప్పటికీ మందులను సకాలంలో వాడకం ద్వారా దీని వ్యాప్తి తీవ్రతను తగ్గించవచ్చని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. స్థానిక సర్వజన ఆసుపత్రిలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ వ్యాధి చికిత్స కోసం యాంటీ రిట్రోవైరల్ థెరపీ అందుబాటులో ఉందని, దీంతో వ్యాధిగ్రస్థులు ఉపశమనం పొందవచ్చన్నారు. హెచ్ఐవీ సోకిన వారిపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డా.కె.అనిత, జిల్లా బాలల సంరక్షణాధికారి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సిక్కోలు పుస్తకమహోత్సవం

శ్రీకాకుళం అర్బన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సిక్కోలు పుస్తక మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. 'సంక్షోభంలో ఆంధ్రప్రదేశ్' పుస్తకాన్ని ఆవిష్కరించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు బొడ్డేపల్లి జనార్దనరావు 'సమాజమా మేలుకో' ఏకపాత్రాభినయంతో ఆకట్టుకున్నారు. కోరాడ రామారావు బృందం ఆధ్వర్యంలో రైతుకోసం జానపద నృత్య రూపకం ఆలోచింపజేసింది.



రైతు కోసం జానపద నృత్యరూపక ప్రదర్శన

రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

● శ్రీకాకుళం ఎమ్మెల్యే శంకర్



రైతులకు మినుము విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం రూరల్, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. రూరల్ మండలం లంకాం గ్రామంలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రాల వద్ద తాగునీరు, విశ్రాంత గదులు, గింజల ఎండ బెట్టే స్థలాలు ఏర్పాటు చేయాలన్నారు. ధాన్యాన్ని దళారులకు కాకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రా ల్లో విక్రయించాలని రైతులకు సూచించారు. అనంతరం రైతులకు మినుము విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీఏ బి.రజని, తహసీల్దార్ ఎం. గణపతి, ఏవో వి.నవీన్, ఎంపీడీవో వి.ప్రకాశరావు, టీడీపీ నేత మూకళ్ల శ్రీనివాసరావు, సర్పంచ్ చిట్టి రవి, పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రతి ధాన్యం గింజా కొనుగోలు: శివ్వాల



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ

సరుబుజ్జిలి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో సాగుచేసిన రైతుల నుంచి ప్రతి ధాన్యం గింజా కొనుగోలుకు ప్రభుత్వం చర్యలు తీసు కుందని డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ అన్నారు. మంగళ వారం కొత్తకోట సహకార సంఘ ఆధ్వర్యంలో చిన్న కాగితాపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో రైతులకు ఎటు వంటి ఇబ్బందులు లేకుండా సహకార సంఘాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. అర్హులైన రైతులందరికీ అన్నదాత సుఖీభవ నిధులు జమవుతాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎల్.మధుసూదన్, ఏవో కె.మన్మథరావు, డీటీ సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు అంబళ్ల రాంబాబు, నాయకులు వెలమల రమేష్, కూటికుప్పల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

21న జిల్లాస్థాయి క్విజ్ పోటీలు

కవిటి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మత్స్యకార దినోత్సవం సందర్భంగా ఈనెల 21న బొరివంక కళింగ సీమ కళాపీఠం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇద్దివానిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగే ఈ పోటీల్లో 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు పాల్గొనవచ్చని వారు పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలి

ఎచ్చెర్ల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.మోహనరావు, జిల్లా అధ్యక్షుడు పి.చంద్రరావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెలమల రమణ కోరారు. చిలకపాలెంలో మంగళ వారం వారు మాట్లాడుతూ.. దళారీలు అతి తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారన్నారు. తుపాన్ నేపథ్యం లో తేమ శాతం, నాణ్యత ప్రమాణాలు తగ్గించి కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. సంఘ నేతలు నందోడు, పుట్టా కైలాస్ పాల్గొన్నారు.

ఐక్యతతోనే అభివృద్ధి

లావేరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మనమంతా ఐక్యంగా ఉండడం ద్వారా అభివృద్ధి సాధించవచ్చని నాయీ బ్రాహ్మణుల సంఘం మండల అధ్యక్షుడు రొంపివలస మల్లేశ్వరరావు అన్నారు. మంగళవారం బుడుమూరు సంత తోటలో సంఘం ఆధ్వర్యంలో వన భోజన కార్యక్రమం నిర్వహించారు. సామాజిక భవనం మంజూరు చేయాలని, 50 ఏళ్లకే పింఛన్ సదుపాయం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు వి.తవిటయ్య, సీహెచ్ రాము, బి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐగా సందీప్

జి.సిగడాం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జి.సిగడాం ఎస్ఐగా సందీప్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఎచ్చెర్ల నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన వై.మధుసూదనరావు శ్రీకాకుళం-2 టౌన్ పోలీసు స్టేషన్‌కు బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన సందీప్ మాట్లాడుతూ.. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. రాత్రి వేళల్లో గస్తీని ఏర్పాటు చేసి దొంగతనాల నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు.

వ్యక్తికి నెల రోజుల జైలు

శ్రీకాకుళం క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో రోడ్డుపై రాకపోకలు సాగించే వారికి ఇబ్బందులు కలిగించిన వ్యక్తికి సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి శివరామకృష్ణ నెల రోజులు జైలుశిక్ష విధించినట్టు వన్‌టౌన్ ఎస్ఐ హరికృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ వివరాలిలా ఉన్నాయి.. జిల్లా పరిషత్ కాలనీకి చెందిన జొన్నా రవికుమార్ ఈనెల 17న మద్యం మత్తులో చిన్నబరాటం వీధిలో వచ్చిపోయే వారికి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తు న్నట్టు వచ్చిన సమాచారం మేరకు ఆయనను స్టేషన్‌కు తరలించి డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు చేసి మంగళవారం శ్రీకాకుళం సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచామన్నారు. ఈ మేరకు న్యాయాధికారి శివరామకృష్ణ.. రవికుమార్‌కు నెల రోజులు జైలు శిక్ష విధించినట్టు వనటౌన్ ఎస్ఐ హరికృష్ణ తెలిపారు.

23న అస్మిత అథ్లెటిక్స్ లీగ్ పోటీలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక కోడిరామ్మూర్తి స్టేడియంలో ఈనెల 23న అండర్-14, 16 బాలికలకు ఆస్మిత జిల్లాస్థాయి అథ్లెటిక్స్ లీగ్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.సాంబమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఖేలో ఇండియా, అథ్లెటిక్స్ ఫెడరేషన్ సౌజన్యంతో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఈ మీట్‌కు పాల్గొనే క్రీడాకారులు ఆధార్‌కార్డు, వయసు ధ్రువీకరణ పత్రంతో ఎంపికల తేదీన ఉదయం 8 గంటలకు పాల్గొని ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.మాధవరావు వద్ద రిపోర్టు చేయాలని కోరారు.

డిగ్రీ విద్యార్థుల క్షేత్ర పరిశీలన

కవిటి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం డిగ్రీ కళాశాల విద్యార్థులు రాజపురంలో క్షేత్ర స్థాయి పరిశీలన మంగళవారం నిర్వహించారు. చదువుతోపాటు ప్రత్యక్ష అనుభవం ఉండేలా ఈ పర్యటన ఏర్పాటు చేసినట్లు జువాలజీ, బోటనీ లెక్చరర్లు శాంతా, టి.బృందావన్ తెలిపారు. గ్రామ సమీపంలో ఉన్న పౌల్ట్రీ ఫార్మింగ్‌ను పరిశీలించారు. బ్రీడ్స్ పెంపకంపై నిర్వాహకులు వివరించారు.

పథకాలు సక్రమంగా అమలు చేయాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మత్స్యకార పథకాలను సక్రమంగా అమలు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. తన చాంబర్‌లో మత్స్యశాఖ అధికారులతో సంక్షేమ పథకాల అమలుపై మంగళవారం సమావేశం నిర్వహించారు. సీఆర్‌సీ ఎస్‌వీ గ్రామాలను గుర్తించి, లబ్ధిదారుల ఆర్థికాభివృద్ధికి పథకాలను అందజేయాలన్నారు. మత్స్యశాఖ జేడీ సత్యనారాయణ, తహసీల్దార్ గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

మితిమీరిన మందులు వాడొద్దు

ఆమదాలవలస, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అనుబంధ రంగాల్లో మితిమీరిన మందుల వాడకం వల్ల దుష్ప్రభావాలు కలిగే అవకాశం ఉందని, ఈ ప్రభావం మానవుల ఆరోగ్యంపై పడుతుందని కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో కేవీకే కేంద్ర మత్స్యసాంకేతిక సంస్థ విశాఖపట్నం ఆధ్వర్యంలో చేపలు, రొయ్యల రైతులకు యాంటీ బయోటిక్స్ వాడకంపై శాస్త్రవేత్తలు మంగళవారం అవగాహన కలిగించారు. చేపలు, రొయ్యల పెంపకంలో మందుల వాడకంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐఎఫ్‌టీ శాస్త్రవేత్త డాక్టర్ అహమ్మద్‌బాషా, కేవీకే మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ బాలకృష్ణ, మత్స్య రైతులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలి

● విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు



మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

ఎచ్చెర్ల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కూటమి పార్టీ నేతలు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. చిలకపాలెంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గం టీడీపీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ, జనసేన నేతలు, కార్యకర్తలతో సమన్వయంగా పనిచేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. అభివృద్ధి, సంక్షేమాలకు సమాన ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవే రుస్తూ మంచి పాలన అందిస్తున్నట్టు తెలిపారు. కార్య క్రమం లో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ అన్నెపు భువనేశ్వరరావు, పార్టీ నేతలు లంక శ్యామ్, వావిలపల్లి రామకృష్ణ, కుమరాపు రవికుమార్, పైడి ముఖలింగం, పంచిరెడ్డి కృష్ణారావు, మెండ రాజారావు, గట్టెం శివరామ్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయానికి కులగణన చేపట్టాలి



శ్రీకాకుళం అంబేడ్కర్ జంక్షన్ వద్ద నిరసన

శ్రీకాకుళం అర్బన్/సరుబుజ్జిలి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం జనగణనలో కుల గణన చేపట్టాలని సీపీఎం జిల్లా సమితి సభ్యుడు టి.తిరుపతిరావు, బొత్స సంతోష్ డిమాండ్ చేశారు. మంగళవారం శ్రీకాకుళం, సరుబుజ్జిలిలో నిరసన కార్యక్రమం చేపటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. 2026లో జరిగే జనగణనలో కులగణన చేపట్టాలన్నారు. ఇప్ప టికే దళితులు, గిజనులపై దాడులు, దౌర్జన్యాలు జరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర పభుత్వాలు పట్టించు కోవడం లేదని విమర్శించారు. సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం రాజకీయ పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఎముచిత స్థానం కల్పించాలంటే జనగణనతో కులగణన నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమాల్లో బీఎస్పీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎంవీ మల్లేశ్వరరావు, కె.రిన్నారావు, కార్మిక సంఘాల సీనియర్ నాయకుడు చిక్కాల గోవిందరావు, కులనిర్మూలన పోరాట సంఘ కార్యదర్శి జగన్నాథం, సఫాయి కర్మచారి సంఘం నుంచి ఎ.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ప్రొఫెసర్లు

ఎచ్చెర్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవాల వినియోగానికి ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని వక్తలు పిలుపునిచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో కేంద్ర సామాజిక న్యాయం, సాధికారిత మంత్రిత్వ శాఖ సూచనల మేరకు నషా ముక్త్ భారత్ అభియాన్ 5వ వార్షికో త్సవాన్ని మంగళవారం నిర్వహించారు. దీనిలో భాగంగా మాదక ద్రవ్యాల వినియోగాన్ని సమష్టిగా అడ్డుకోవాలనే నినాదంతో 'సంకల్ప' అవగాహన ర్యాలీ నిర్వహించారు. మత్తు పదార్థాలకు, వ్యసనాలకు దూరంగా ఉంటామంటూ విద్యార్థు లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫె సర్ బి.అడ్డయ్య, దివ్యాంగుల సంక్షేమశాఖ డీడీ బిశైలజ, వర్సిటీ ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఎం.అనూరాధ, డాక్టర్ సీహెచ్ రాజశేఖరరావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.వనజ తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీ క్యాంపస్‌లో...

శ్రీకాకుళంలోని ఆర్జీకేయూటీ క్యాంపస్‌లో మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా మంగళవారం సామూహిక ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ, ఏవో డాక్టర్ ముని రామకృష్ణ, డీన్ డాక్టర్ శివరామకృష్ణ పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

ఆమదాలవలస, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్‌కు యువత బానిస కావద్దని, వీటికి దూరంగా ఉండాలని ప్రిన్సిపాల్ బి.శ్యాంసుందర్ కోరారు. నాషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగం గా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కె.రాజారావు, జె.రవి తదితరులు పాల్గొన్నారు.

8 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

శ్రీకాకుళం క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సీపన్నాయుడుపేట వద్ద ఉన్న ఓ రియల్ ఎస్టేట్ భవనం మేడపై పేకాట ఆడుతున్న 8 మందిని మంగళవారం టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.13వేల నగదు, 7 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ ఈశ్వరరావు తెలిపారు.

ఆదిత్యాలయంలో మహాలింగార్చన

అరసవల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రత్యక్షదైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి ఆలయంలో మహాలింగార్చన నిర్వహించారు. మాస శివరాత్రి, కృష్ణాంగారక చతుర్దశి సందర్భంగా మంగళవారం అభిషేకాలు చేశారు. ఇప్పిలి సాందీపశర్మ, దర్భముళ్ల శ్రీనివాసశర్మ పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక కుంకుమ పూజలు

కంచిలి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మకరాంపురం షిర్డీసాయి దేవాలయంలో మంగళవారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. సుబ్రహ్మణ్య స్వామి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో మహిళలు పెద్దఎత్తున ఈ పూజల్లో పాల్గొన్నారు.

ఘనంగా వీర వసంతేశ్వర స్వామి కల్యాణం

గార, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శ్వేతగిరిపై వెలసిన వీరవసంతేశ్వరస్వామి కల్యాణం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మహేంద్రాడ రవికుమార్ ఆధ్వర్యంలో రుత్వికులు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, కల్యాణాన్ని చేపట్టారు. ● అంపోలు గ్రామంలో అగస్త్యేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న వల్లీదేవ సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం మహిళలు సామూహిక కుంకుమార్చనలు చేశారు.

బాలల హక్కులను పరిరక్షించాలి

ఇచ్ఛాపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): బాలల హక్కులను పరక్షించే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని తహసీల్దార్ ఎన్.వెంకటరావు అన్నారు. బాలల హక్కుల పరిరక్షణ దినోత్సవం సందర్భంగా పట్టణంలో ర్యాలీ చేపట్టారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాతపాల్గొన్నారు.

● ఎచ్చెర్ల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పిల్లల దత్తతపై అవగాహన అవసరమని జిల్లా బాలల రక్షణ విభాగం అధికారి ఇప్పిలి లక్ష్మీనాయుడు అన్నారు. ఎచ్చెర్ల మహిళా ప్రాంగణంలో మిషన్ వాత్సల్య, జిల్లా బాలల రక్షణ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కలిగించారు. కార్యక్రమంలో సీడీపీవో డి.పాపినాయుడు, ఔట్రీచ్ వర్కర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.